క్లుప్తంగా

ఉద్యోగం పేరిట మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఎంవీపీ కాలనీ: భారత సైన్యంలో ఫైర్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివాజీపాలెంకు చెందిన కె.చిట్టిబాబుకు తన స్నేహితురాలైన వి.వెన్నెల రాణి అనే మహిళ ద్వారా ఎం.రామారావు అనే వ్యక్తి 2023లో పరిచయమయ్యారు. తనను సీఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐగా పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో భారత సైన్యంలో ఫైర్‌మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని చిట్టిబాబును నమ్మించాడు. ఇందుకుగాను రూ.2 లక్షలు ఇవ్వాలని కోరాడు. ఉద్యోగం వచ్చిన తర్వాత రూ.7 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. ఈ నేపథ్యంలో 2023 ఫిబ్రవరిలో చిట్టిబాబు అతనికి రూ.70 వేలు అడ్వాన్స్‌గా అందజేశాడు. అయితే అనంతరం ఉద్యోగం ఇప్పించకుండా రామారావు మోసం చేశాడు. ఈ నేపథ్యంలో రామారావుపై చర్యలు తీసుకోవాలని చిట్టిబాబు ఎంవీపీ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కుమార్తెలతో తల్లి అదృశ్యం

ఎంవీపీ కాలనీ: తన ఇద్దరు కుమార్తెలతో కలిసి భార్య అదృశ్యమైందని ఓ వ్యక్తి ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భీమిలిలోని గొల్లల తిమ్మాపురంలో కొర్రాయి వెంకటరావు కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఆగస్టు 28న పెదవాల్తేర్‌లోని అత్త గారి ఇంటికి భార్య కొర్రాయి శైలజ (36), కుమార్తెలు హేరంబిక (14), యోగితశ్రీ (12) వెళ్లారు. రెండు రోజుల్లో తిరిగి ఇంటికి వచ్చేస్తామని చెప్పారు. అనంతరం వారు రాకపోవడంతో వాకబు చేయగా ఈ నెల 2న పెదవాల్తేర్ నుంచి బయలుదేరి వెళ్లిపోయినట్టు తెలిపారు. అయితే వాళ్లు ముగ్గురు భీమిలి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. కూతుళ్ల ఫోన్ నంబర్లు స్విచ్ ఆఫ్ వస్తుండడంతో వెంకటరావు ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



ఆరిలోవలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆరిలోవలో సీపీఎం నాయకులు శనివారం పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పార్టీ నాయకులతో కలిసి ఆరిలోవ, రవీంద్రనగర్, ఆదర్శనగర్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను 46 విభాగాలుగా విడగొట్టి ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేస్తున్నారన్నారు. ఇప్పటికే 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించేయడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా ఈ నెల 11న పాతగాజువాక కూడలిలో బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సభను ప్రజలు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు న రేంద్ర కుమార్, రమణ, వెంకటరావు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతలో గెద్దలు కీలకం



మట్టితో విద్యార్థులు తయారు చేసిన గెద్ద బొమ్మ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో శనివారం అంతర్జాతీయ గెద్దల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులకు గెద్దలపై అవగాహన కల్పించారు. మట్టితో గెద్ద బొమ్మలు తయారు చేయడం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల విజేతలకు జూ క్యూరేటర్ జి.మంగమ్మ, పర్యావరణవేత్తలు జయశ్రీ, సోహన్ బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ అభినందన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ గెద్దలు పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అవి పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి విముక్తి



ఫలించిన పోరాటం : జీవీఎంసీ కౌన్సిల్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ ముప్వల లక్ష్మి (ఫైల్)



లెండి వనం పార్కు వద్ద కార్పొరేటర్ ముప్వల లక్ష్మి సురేష్‌తో స్థానికులు



20 ఏళ్ల తర్వాత అనుమతి లభించడంతో లెండి వనంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బీచ్‌రోడ్డు: సుదీర్ఘ నిరీక్షణ, పోరాటం ఫలించాయి. సుమారు 20 ఏళ్ల తర్వాత ఈస్ట్ పాయింట్ కాలనీలోని లెండి వనం పార్కులోకి స్థానికులకు అనుమతి లభించింది. ఇన్నాళ్లూ తాళాలు వేసుకుని తమ స్వాధీనంలో ఉంచుకున్న కబ్జాదారుల నుంచి వనానికి విముక్తి లభించింది. 8 నెలల కిందట జీవీఎంసీ అధికారులు స్థానికులకు పార్కును అప్పగించినప్పటికీ కూటమి నేతల అండతో ప్రైవేటు వ్యక్తులు ఆ పార్కును కబ్జా చేయాలని అనుకున్నారు. అయితే స్థానిక కార్పొరేటర్ ముప్వల లక్ష్మి సురేష్ పోరాటంతో కబ్జాదారులకు చిక్కకుండా స్థానికులకు పార్కు సొంతమైంది. ఎట్టకేలకు పార్క్‌లోకి స్థానికులను అనుమతిస్తూ జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులను అనుమతించకుండా తాళాలేసేసి..

1970లో ఏయూ ఎంప్లాయీస్ హౌసింగ్ లేఅవుట్లను జీవీఎంసీ 20వ వార్డులోని ఈస్ట్ పాయింట్ కాలనీలో ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్లలో పిల్లల పార్కు, ఇతర పార్కుల కోసం నాలుగు చోట్ల ఖాళీ స్థలాలను కేటాయించారు. ఇందులో ఒక స్థలంలో కేడీపీఎం హైస్కూల్ నిర్మించగా మరో స్థలంలో చిన్న పిల్లల పార్కును అభివృద్ధి చేశారు. అయితే మరో రెండు ఖాళీ స్థలాలను 20 ఏళ్ల కిందట వేరే లేఅవుట్‌కు చెందిన వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ లెండి వనము పార్కు, బాబా చావడి పార్కులో శివుడు దేవాలయాలను ఏర్పాటు చేశారు. అనంతరం ఆ పార్కులోకి స్థానికులను అనుమతించకుండా తాళాలు వేసేయడంతో తమ కోసం కేటాయించిన స్థలంలో వేరే వాళ్ల పెత్తనం ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్థలం తమకు ఇప్పించాలని 20 ఏళ్లగా పోరాటం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ దృష్టికి సమస్య

ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉన్న పార్కులను తిగిరి స్థానికులకు అప్పగిస్తామని వైఎస్సార్ సీపీ 20వ వార్డు అభ్యర్థి ముప్వల లక్ష్మి సురేష్ జీవీఎంసీ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం... ఆమె కార్పొరేటర్‌గా గెలిచిన తర్వాత వార్డులోని చాలా పార్కులను స్థానికులకు అప్పగించారు. దీంతో ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రజలు తమ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె లెండి వనం పార్కు కబ్జా విషయాన్ని జీవీఎంసీ కౌన్సిల్‌లో ప్రస్తావించారు. దీంతో కౌన్సిల్ సానుకూలంగా స్పందించి గత ఏడాది డిసెంబర్‌లో పార్క్‌ను స్థానికులకు అప్పగించింది. పార్క్‌ను స్థానికులకు జీవీఎంసీ అధికారులు అప్పగించడంతో ఆ ప్రైవేటు వ్యక్తి కూటమి నాయకులను ఆశ్రయించాడు. దీంతో జీవీఎంసీ అధికారులు మరలా ప్రైవేటు వ్యక్తికి మొత్తం అప్పగించేశారు. స్థానికులకు అనుమతి లేకుండా చేసేశారు. దీంతో స్థానికులకు నిరాశే మిగిలింది.

కౌన్సిల్‌లో మళ్లీ నిరసన తెలపడంతో...

లెండి వనం పార్క్‌ను స్థానికులకు అప్పగించినట్లు ఇచ్చి... మరలా ప్రైవేటు వ్యక్తుల స్వాధీనంలోనే ఉంచడంపై కార్పొరేటర్ ముప్వల లక్ష్మి సురేష్ కౌన్సిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. పార్కు కబ్జాకు గురైందన్న విషయంపై పలు పత్రికల్లో కథనాలూ ప్రచురితమవడంతో కౌన్సిల్‌లో పెద్ద రచ్చ అయ్యింది. తప్పనిసరి పరిస్థితుల్లో జీవీఎంసీ అధికారులు స్పందించి పార్క్‌లోకి స్థానికులను అనుమతించాలని, వారు అక్కడ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని చెప్పడంతో అందరూ ఒక్కసారిగా సంతోషం వ్యక్తం చేశారు. 20 ఏళ్ల తర్వాత లెండి వనం పార్కులోకి ప్రవేశం లభించడంతో స్థానికులు అన్నసమారాధన నిర్వహించారు. వినాయక మహోత్సవాల్లో భాగంగా గత శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ ముప్వల లక్ష్మి ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

చాలా సంతోషంగా ఉంది



1970లో మా నాన్న గారి హయాంలో ఈ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అప్పుడు పార్కుల కోసం విడిచిపెట్టిన స్థలాలను వేరే వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులమైన తమను రానివ్వకుండా పార్కుకు తాళాలు కూడా వేసేశారు. ఈ పార్కు సమస్య పరిష్కారం కోసం కొన్నేళ్లుగా జీవీఎంసీ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. కార్పొరేటర్ ముప్వల లక్ష్మి చొరవతో పార్కు స్థానికుల ఆధీనంలోకి రావడం చాలా సంతోషంగా ఉంది.

– ఆర్.బంగారురాజు, అధ్యక్షుడు, ఈస్ట్ పాయింట్ చిల్డ్రన్ పార్కు అసోసియేషన్

స్థానికులకు అండగా ఉంటా



నన్ను గెలిపించిన వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా అండగా ఉంటాను. ఈస్ట్ పాయింట్ కాలనీ ప్రజలు ఈ పార్కు సమస్యను నా దృష్టికి తీసుకొచ్చిన తర్వాత నేను కౌన్సిల్‌లో ప్రస్తావించాను. అనంతరం సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. జీవీఎంసీ ఉన్నాతాధికారులు స్పందించి పార్కును స్థానికులకు అప్పింగించడం అభినందనీయం. ఈ పార్కు అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తాను.

– ముప్వల లక్ష్మి సురేష్, 20వ వార్డు కార్పొరేటర్



బాబా చావడి పార్కు



లెండి వనము

రోడ్డు మధ్యలో ఇనుప రాడ్లతో ప్రమాదాలు



ముడసర్లోవ వద్ద రోడ్డు మధ్యలో నిలిపిన ఇనుప రాడ్డు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక రోడ్డు మధ్యలో ఇనుప కొయ్య వాహనచోదకులకు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ విశాలమైన రోడ్లున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో తీసుకొచ్చిన డెబ్రిస్‌ను ఈ రోడ్లలో వేసేస్తున్నారు. వారిని కట్టడి చేయడానికి గతంలో జీవీఎంసీ రోడ్డుకు అడ్డంగా పలుచోట్ల గడ్డర్స్ (ఇనుప గేట్లు)ను ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతంలో గత ఏడాది ప్రభుత్వం ఇసుకయార్డు ఏర్పాటు చేయడంతో ఇసుక లారీల రాకపోకల కోసమని రోడ్డులోని గేటు పైనున్న రాడ్లు తొలగించింది. అయితే రోడ్డు మధ్యలో పాతిన ఇనుప కొయ్యలను మాత్రం అలానే వదిలేసింది. ఈ ఇనుప కొయ్యలు అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనాలు, కార్లకు ఆటంకంగా మారాయి. వాటిని ఢీకొని ఆయా వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఖాళీగా ఉన్న ఈ రోడ్లపై ఎక్కువగా కారు డ్రైవింగ్ నేర్చుకోవడానికి ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువ మంది వస్తుంటారు. నేర్చుకునే క్రమంలో ఇక్కడ రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప కొయ్యలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన వాటిని తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఆటోవాలాలను ప్రభుత్వమే ఆదుకోవాలి

- 11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి
- ఏఐటీయూసీ నాయకుడు పడాల గోవింద్



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ కోరారు. పలు డిమాండ్లతో ఈ నెల 11న తలపెట్టిన ఆటోవాలాల చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఏఐటీయూసీ విశాఖ జిల్లా ఆటో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డులో గల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆటోవాలాలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తోందన్నారు. ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఓలా, ఉబర్, రాపిడో ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ల నుంచి టూ వీలర్లను వెంటనే తొలగించాలని కోరారు. వాహన మిత్ర పథకం అమలు చేసి రూ.15 వేలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, ఆటో అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వాహనాల మీద అధిక జరిమానాలు విధించే జీవో నంబర్ 21, 31ని వెంటనే సవరించాలని కోరారు. పలు డిమాండ్లతో ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధురెడ్డి, దల్లి నాని, షేక్ బాషా, కృష్ణ నాయుడు, శ్రీనివాస్, చంటి పాల్గొన్నారు.

డీఎస్సీ ర్యాంకర్లకు అభినందనలు



డీఎస్సీ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో వారిని వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ శనివారం అభినందించారు. వీరు ఏయూలో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సు పూర్తి చేశారు. బొల్లోజు హరీష్ పీజీటీ సివిక్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. వీటితోపాటు స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు, టీజీటీ సోషల్ స్టడీస్‌లో రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు, పీజీటీ సోషల్ స్టడీస్‌లో రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 100వ ర్యాంకు, టీజీటీ తెలుగు విభాగంలో 221వ ర్యాంకు సాధించాడు. మరో విద్యార్థి బొమ్మిడి డిల్లేష్ టీజీటీ సోషల్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. పీజీటీ సివిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, పీజీటీ సోషల్‌లో రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో జిల్లా స్థాయిలో 9వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 56వ ర్యాంకు సాధించాడు. వీరిద్దరినీ తన కార్యాలయంలో వీసీ సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.నరసింహారావు, ఆచార్య షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు, సిబ్బంది

ఏయూ క్యాంపస్: స్వచ్ఛత పక్వాడా వారోత్సవాల్లో భాగంగా ఐఐఎం విశాఖపట్నం ఆధ్వర్యంలో శనివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, సంస్థ సిబ్బంది స్వయంగా బీచ్‌లోని వ్యర్థాలను తొలగించారు. పర్యావరణ పరిరక్షణకు తాము ఈ కార్యక్రమం నిర్వహించినట్లు విద్యార్థులు తెలిపారు. నిరంతరం తాము బీచ్ క్లీనింగ్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రజల్లో తీర ప్రాంత సంరక్షణ, పర్యావరణ సంరక్షణ పట్ల అవగాహన పెంచడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తాం

బీచ్‌రోడ్డు: దేవాలయాల్లో భక్తులకు సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ అన్నారు. పెదవాల్తేరు లాసన్స్‌బే కాలనీలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలితో శనివారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఛైర్మన్‌గా బైరెడ్డి గోవిందరెడ్డి, సభ్యులుగా అలజంగి ఈశ్వరరావు, నానాజీ, చిల్లకాట మణి, జగన్నాథ పద్మావతి, దశరథ రామయ్య, గొర్లె సుందరి దేముడు బాబు, జలగడుగుల రాధిక ప్రమాణం చేశారు. కార్యక్రమంలో చోడె వెంకట పట్టాభిరామ్, బైరెడ్డి పోతన రెడ్డి, ఈవో ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త వీధి దీపాల ఏర్పాటు



అమర్చడానికి సిద్ధం చేసిన బల్బులు

ఆరిలోవ: జీవీఎంసీ పదమూడో వార్డు ముడసర్లోవ ప్రాంతంలో అధికారులు కొత్తగా విద్యుత్ సౌకర్యం కల్పించారు. ముడసర్లోవ ప్రాంతం పాత స్కిల్ డెవలప్‌మెంట్ భవనం ఎదురుగా, వాకర్స్ అసోసియేషన్ కార్యాలయం, ఓపెన్ జిమ్ వద్ద వీధి దీపాలు ఇంతవరకు లేవు. దీంతో అటుగా వెళ్లే వాహనచోదకులతోపాటు వాకర్స్ సాయంత్రం సమయంలో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై స్థానికులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పలుమార్లు జీవీఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదులు చేశారు. దీనికి స్పందించిన అధికారులు కార్పొరేటర్ కెల్ల సునీత సమక్షంలో శనివారం ఇక్కడ మూడు విద్యుత్ స్తంభాలు, నాలుగు బల్బులు అమర్చారు. కొత్త విద్యుత్ స్తంభాలు, బల్బులకు సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు.

వినాయక మండపాల వద్ద అన్నసమారాధనలు



అన్నసమారాధనలో మొల్లి అప్పారావు, తదితరులు



పదమూడో వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, నాయకులు, కమిటీ సభ్యులు



అన్నప్రసాదం వడ్డిస్తున్న పీతల గోవింద్, తదితరులు

ఆరిలోవ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరిలోవలో పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ పదమూడో వార్డు పరిధిలోని శివాజీనగర్, పాండురంగాపురం, బృందావన కాలనీలోని వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్నసమారాన చేపట్టారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, విశాఖ మార్కెటింగ్ శాఖ మాజీ అధ్యక్షుడు అల్లంపల్లి రాజబాబు, శిరీష, వాసు, దుర్గారావు పాల్గొన్నారు.

■ జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి లీలాసుందరయ్యనగర్‌లో నిర్వహిస్తున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన చేపట్టారు. లీలా సందరయ్యనగర్, నెహ్రూనగర్, దుర్గానగర్, టి.ఐ.సి.పాయింట్ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏడువాక సన్యాసిరావు, వరసిద్ధి వినాయక ఎల్లో బాయ్స్ సాయి వివేక్, తరుణ్ వర్ధన్, సూర్య, అనంత్, మోహన్, వాసు, గౌతమ్, కార్తీక్, హర్ష పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 28వ వార్డులోని జేఎస్ఎం కాలనీలో శనివారం మహా అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు చిన్న, రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా వెంకోజీపాలెం గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధను వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రారంభించారు. నిర్వాహకులు చిన్న, రమణ, అన్నాజీ, భవానీ పాల్గొన్నారు.

■ జీవీఎంసీ 22వ వార్డులోని శివాజీపాలెం శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధనను పీతల గోవింద్ ప్రారంభించారు. కమిటీ సభ్యులు ప్రవీణ్, రాజు, రామిరెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

ఘనంగా అనుపోత్సవం



అనుపోత్సవంలో కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జీవీఎంసీ 22వ వార్డు పరిధి శివాజీపాలెంలో అనుపోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వరసిద్ధి వినాయక అభయ ఆంజనేయ ఆలయంలో గత తొమ్మిది రోజులుగా వినాయక నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని మేళతాళాలు, సంప్రదాయ కోలాట నృత్యాల నడుమ నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై కూటమి వైఖరి స్పష్టం చేయాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశంలో భారతీయ సరకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్ సుంకాలను తక్షణం రద్దు చేయాలని, సుంకాలపై మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్, సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.మణి తదితరుల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రహిమాన్, మణి మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు ఎం.సుబ్బారావు, ఎం.మన్మథరావు, కె. దేవా, సీఎస్ క్షేత్రపాల్, ఎంఎస్ పట్నాయిక్, కె. సత్యనారాయణ, జీవీఎం రెడ్డి, ఎండీ బేగం, కొండమ్మ, కె. వనజాక్షి, వెంకటరావు, ఎ. దేముడమ్మ, వై. రాంబాబు,ఎం శ్రీనివాసరావు పలువురు వామపక్ష పార్టీల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.